www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | మంగళవారం, నవంబర్3,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:252 | పేజీలు: 8 | వెల: రూ.5/-

అసలు వీటిని ఎన్నికలంటారా?: రవీంద్రనాథ్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార టీడీపీ అరాచకాలకు పాల్పడిందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ నేత రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. మహిళలపై దాడులు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని, అసలు వీటిని ఎన్నికలంటారా? అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు బజారు రౌడీలా ప్రవర్తిస్తున్నారని రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. “చంద్రబాబు మాటలకు, ఆచరణకు సంబంధం ఉండదు. ఆయన మేక తోలు కప్పుకున్న తోడేలు” అని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని, ఎన్నికల్లో అంతులేని దుర్మార్గాలకు తెరలేపారని ఆరోపించారు. మీడియాపై కూడా దాడులు చేశారని, సీఎంగా కొనసాగే అర్హత చంద్రబాబుకు లేదని అన్నారు.మరోవైపు, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ... ఎన్నికల్లో హింస జరుగుతున్నా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పడాన్ని తప్పుబట్టారు. ఎన్నికల ప్రక్రియలో ఎక్కడైనా ప్రజాస్వామ్యం కనిపించిందా? అని ఆయన ప్రశ్నించారు.

ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలి
- భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదు
- హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి
- అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భాగ్యనగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ (సోమవారం) మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాల తరలింపులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, గ్రీనరీ నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.మరోవైపు, నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం




- రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ స్థానాలనూ కైవసం చేసుకోవాలని లక్ష్య నిర్దేశం
- కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పట్టణ స్థానిక ఎన్నికల కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం

అమరావతి, (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

చౌటుప్పల్‌లో జోగిని దారుణ హత్య

- 130 తులాల బంగారం, 2.5 కిలోల వెండి అపహరణ
- హత్య అనంతరం సొమ్ములతో కారులో పరారీ



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో సంచలనం సృష్టించిన జోగిని హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. జోగిని రాళ్లబండ సుధాకర్‌ను హత్య చేసి, భారీగా నగదు, బంగారం దోచుకెళ్లిన ఇద్దరు శిష్యులను అదుపులోకి తీసుకున్నారు.

ఏపీలో పరిషత్ పోరు

ఈ నెల 4,5 తేదీల్లో సెలవు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇప్పుడు రాష్ట్ర యంత్రాంగం మొత్తం పరిషత్ ఎన్నికలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు, ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించింది.

పంజాబ్‌లో ఆప్‌కు షాక్

పంజాబ్‌లో ఆప్‌కు ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామా

న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)



పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీజేపీలో చేరారు. సోమవారం ఉదయం ఆప్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ తన శాసనసభ సభ్యత్వాని కి రాజీనామా చేశారు.అనంతరం కొన్ని గంటల్లోనే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

కర్ణాటకలో పెరగనున్న ఆర్టీసీ బస్సు ఛార్జీలు

- కర్ణాటకలో నవంబర్ 5 నుంచి పెరగనున్న బస్ ఛార్జీలు
- రూ.9,000 కోట్ల నష్టాలే కారణమంటున్న ప్రభుత్వం




నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులపై మరో భారం మోపడానికి సిద్ధమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్టీసీ బస్సు చార్జీలను నవంబర్ 5వ తేదీ నుంచి పెంచుతున్నట్లు రవాణా శాఖ మంత్రి బైరతి సురేశ్ ప్రకటించారు. భారీ ఆర్థిక నష్టాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ
- 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య
- ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ
- ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా



హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చే స్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోం దని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పో యిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు.

అబద్ధాలకు కేరాఫ్‌గా కాంగ్రెస్

- అమిత్ షా పాదయాత్రకు లక్ష మందికి పైగా వచ్చే అవకాశం ఉందని అంచనా
- వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపాదే అధికారమని ధీమా

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)



ఓట్ చోరీ ఆరోపణలపై భాజపా తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగితే రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఎలా గెలిచారని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రభావం ఉంటే కేరళలో కాంగ్రెస్ ఎలా విజయం సాధించిందని నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలకు కేరాఫ్‌గా మారిందని విమర్శించారు.

ఢిల్లీలో కాలుష్యంపై ఉక్కుపాదం

- కాలుష్యంపై పోరుకు ఢిల్లీలో వింటర్ యాక్షన్ ప్లాన్ ప్రారంభం
- నిర్మాణ ప్రదేశాల్లో తనిఖీలు, దుమ్ము నియంత్రణ నిబంధనలు మీరిన వారికి ఫైన్లు


న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

దేశ రాజధాని ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికారులు 'వింటర్ యాక్షన్ ప్లాన్'ను కఠినంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తొలిరోజైన ఆదివారమే వాహన తనిఖీలు, నిర్మాణ ప్రదేశాల్లో నిబంధనల ఉల్లంఘనలపై కొరడా ఝుళిపించారు.



మురసు తుపాను ఎఫెక్ట్

- మురసు తుపాను హెచ్చరికలతో ఏపీ అప్రమత్తం
- పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటన
- నెల్లూరు--నర్సాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం



తెలంగాణకు 'మురసు' గండం

- మంగళవారం పలు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ
- సోమవారం ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరిక

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తుపాను తీవ్రత దృష్ట్యా సోమవారానికి ఆరెంజ్, మంగళవారానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగాలు సిద్ధంగా ఉండాలని సూచించింది.



ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటి పేజి తరువాయి

మరోవైపు, నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పక్కా ప్రణాళికలతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు కీలక సూచనలు చేశారు. నగరంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరగాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారుభవన నిర్మాణాలు, పార్కులు, గార్డెనింగ్ అవసరాలకు తాగునీటికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. జలమండలి ప్రారంభించిన గ్రీన్ వాటర్ ట్యాంకర్ల సేవలను మరింత విస్తరించాలని ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సిగ్నళ్ల వద్ద



వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు హెచ్ఎండీఏ, మున్సిపల్ కార్పొరేషన్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

మొదటి పేజి తరువాయి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు.ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.



పంజాబ్‌లో 'ఆప్'కు భారీ షాక్..



మొదటి పేజి తరువాయి

- తొలి జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పార్టీ వీడిన నేతలు
- పార్టీ వ్యతిరేక ఆరోపణలతో సస్పెండైన మరో ఎమ్మెల్యే కూడా రాజీనామా

2027 ఎన్నికలకు ఆప్ జాబితా ప్రకటించిన వెంటనే మొదలైన ప్రకంపనలు

సనౌర్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా, సమానా ఎమ్మెల్యే చేతన్ సింగ్ జౌరామాజ్రా ఆదివారం తమ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వీరు సోమవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఆప్ శనివారం ప్రకటించిన 40 మంది అభ్యర్థుల తొలి జాబితాలో ఈ ఇద్దరి పేర్లు లేకపోవడమే వారి రాజీనామాకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. వీరి స్థానాల్లో పార్టీ కొత్తగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను నియమించడంతో, తమను పక్కనపెట్టారని భావించిన ఈ నేతలు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు.రాజీనామా చేసిన చేతన్ సింగ్ జౌరామాజ్రా గతంలో భగవంత్ మాన్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేసి, 2024లో పదవి కోల్పోయారు. మరో ఎమ్మెల్యే పఠాన్‌మాజ్రా కొంతకాలంగా వరద నిర్వహణ, నిధుల కేటాయింపు వంటి అంశాలపై ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఆయనపై గతంలో అత్యాచారం కేసు కూడా నమోదైంది. ఇదే సమయంలో, పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలతో ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న అమృత్‌సర్ నార్త్ ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ కూడా తన అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేయడం ఆప్‌కు మరో దెబ్బగా మారింది.ప్రచారానికి ఎక్కువ సమయం ఇచ్చే వ్యూహంతో ఆప్ ముందుగానే జాబితా ప్రకటించగా, అది రాజీనామాలకు దారితీయడం పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది.

కర్ణాటకలో పెరగనున్న ఆర్టీసీ బస్సు ఛార్జీలు

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలోని నాలుగు రోడ్డు రవాణా సంస్థలు (ఆర్టీసీలు) ఇప్పటికే రూ.9,000 కోట్ల భారీ నష్టాల్లో కూరుకుపోయాయని మంత్రి వివరించారు. గడిచిన ఏడాది కాలంలో డీజిల్ ధరలు ఐదుసార్లు పెరగడం వల్ల సంస్థలపై ఏటా రూ.2,000 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో చార్జీల పెంపు అనివార్యమైందని ఆయన పేర్కొన్నారు.చార్జీల పెంపు అధికారాన్ని ముఖ్యమంత్రి రవాణా శాఖకే అప్పగించారని, గత వారం కేబినెట్‌లో దీనిపై చర్చ జరిగిందని మంత్రి సురేశ్ చెప్పారు. అయితే, చార్జీలను ఎంతమేర పెంచాలనే దానిపై నవంబర్ 4న ఆర్టీసీ అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'శక్తి' పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో పురుష ప్రయాణికుల శాతం 48 నుంచి 36 శాతానికి పడిపోయిందని, ఇది కూడా సంస్థల ఆదాయంపై కొంత ప్రభావం చూపిందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బస్ చార్జీలు పెంచడం ఇది రెండోసారి.



ఢిల్లీలో కాలుష్యంపై ఉక్కుపాదం..

మొదటి పేజి తరువాయి

అధికారిక లెక్కల ప్రకారం, ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు కలిసి దాదాపు 15,000 వాహనాలను తనిఖీ చేశారు. పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికేట్ (పీయూసీసీ) లేని 566 వాహనాలకు రూ.56.6 లక్షల జరిమానా విధించారు. సరిహద్దుల వద్ద నిబంధనలు ఉల్లంఘించి, ఢిల్లీలో ప్రవేశించడానికి ప్రయత్నించిన 1,539 వాహనాలను వెనక్కి పంపారు. వీరి నుంచి రూ.2 లక్షల ఫైన్ వసూలు చేశారు. బీఎస్-6 ప్రమాణాలు లేని ఇతర ప్రాంత వాహనాలను ఢిల్లీలోకి రాకుండా నిలిపివేశారు.మరోవైపు, నిర్మాణ పనుల వల్ల ఏర్పడే దుమ్ము కాలుష్యంపై కూడా అధికారులు దృష్టి సారించారు. మొత్తం 300 నిర్మాణ ప్రాంతాలను తనిఖీ చేయగా, 32 చోట్ల నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. వీరికి పర్యావరణ నష్టపరిహారం కింద రూ.9.8 లక్షలు విధించారు. కొన్ని నిర్మాణాలకు మూసివేత ఆదేశాలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఈ చర్యలపై ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా 'ఎక్స్'లో స్పందిస్తూ.. కాలుష్య నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

మొదటి పేజి తరువాయి

లోకతంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది. ఈవీఎంలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అబద్ధాలకు కేరాఫ్‌గా కాంగ్రెస్



మొదటి పేజి తరువాయి

- కేరళలో కాంగ్రెస్ విజయాన్ని ప్రస్తావించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
- అమిత్ షా హైదరాబాద్ పర్యటనతో ఆరోపణలకు సమాధానం ఇస్తారని వెల్లడి
- ఓట్ చోరీ జరిగితే రాహుల్, రేవంత్ ఎలా గెలిచారు?: రాంచందర్ రావు


కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెప్పేందుకే కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు వస్తున్నారని రాంచందర్ రావు తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలా చేయడం ప్రమాదకరమన్నారు. అలాంటి పరిస్థితులు దేశంలో అరాచకానికి దారితీస్తాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలకు వివరించేందుకే అమిత్ షా పర్యటన చేపడుతున్నారని చెప్పారు.అమిత్ షా పాదయాత్రకు లక్ష మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని రాంచందర్ రావు వెల్లడించారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు హైదరాబాద్ వేదికగా అమిత్ షా సమాధానం చెబుతారని అన్నారు.తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో భాజపా కచ్చితంగా అధికారంలోకి వస్తుందని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు.

మురసు తుపాను ఎఫెక్ట్

మొదటి పేజి తరువాయి

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుపాను తీవ్రరూపం దాల్చడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందుజాగ్రత్త చర్యగా కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. నవంబర్ 2వ తేదీన (సోమవారం) స్కూళ్లు, కాలేజీలను మూసివేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లాలో రేపు కూడా సెలవు ప్రకటించారు.భారత వాతావరణ శాఖ (ఐవీణ) అంచనాల ప్రకారం, 'మురసు' తీవ్ర తుపానుగా బలపడి, నవంబర్ 2 అర్ధరాత్రి నుంచి 3వ తేదీ తెల్లవారుజాము మధ్య నెల్లూరు--నర్సాపురం మధ్య, ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని హెచ్చరించింది.ఈ హెచ్చరికల నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, ఏలూరు జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవు వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లాలో నవంబర్ 2, 3 తేదీల్లో రెండు రోజుల పాటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచించారు. ఈ సెలవులను తదుపరి ప్రభుత్వ సెలవు రోజుల్లో భర్తీ చేయనున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. తుపాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అధికార యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధంగా ఉంది.

చౌటుప్పల్‌లో జోగిని దారుణ హత్య..



మొదటి పేజి తరువాయి

- నమ్మకంగా ఉంటూనే హత్య చేసిన ఇద్దరు అస్సాం శిష్యులు
- హత్య అనంతరం సొమ్ములతో కారులో పరారీ
- కారు జీపీఎస్ సిగ్నల్స్ ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు
- దోపిడీ కోసమే హత్య జరిగిందని ప్రాథమిక నిర్ధారణ

సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన రాళ్లబండ సుధాకర్ (50) కొంతకాలంగా చౌటుప్పల్‌లో నివసిస్తూ జోగినిగా, పండుగల పూజారిగా పేరుగాంచారు. ఈ క్రమంలో ఆయన ఆర్థికంగా బాగా స్థిరపడ్డారు. ఏటా అస్సాంలోని కామాఖ్య ఆలయానికి వెళ్లే సుధాకర్‌కు అక్కడే పవన్, హర్ష అనే ఇద్దరు యువకులతో పరిచయం ఏర్పడింది. మూడు రోజుల క్రితమే వారు ఆయన వద్ద శిష్యులుగా చేరి ఇంట్లోనే ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి సుధాకర్‌పై దాడి చేసిన నిందితులు.. కాళ్లు, చేతులు కట్టేసి, కళ్లలో పెప్పర్ స్ప్రే చల్లి, గొంతు నులిమి కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఇంట్లోని బీరువాలో ఉన్న సుమారు 130 తులాల బంగారం, 2.5 కిలోల వెండి, రూ. 10 లక్షల నగదును దోచుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. సాక్ష్యాలు దొరక్కుండా సీసీటీవీ హార్డ్ డిస్క్‌ను కూడా తమ వెంట తీసుకెళ్లారు.పక్క ఇంట్లో ఉండే సుధాకర్ దత్తపుత్రుడు సురేష్, ఘటనను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన చౌటుప్పల్ సీఐ సతీశ్‌రెడ్డి బృందం, నిందితుల సెల్‌ఫోన్ సిగ్నల్స్, కారు జీపీఎస్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసింది. నిందితులు పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ టోల్‌గేట్ దాటినట్లు గుర్తించి, జీపీఎస్ సాయంతో వారి కారును సిద్దిపేట సమీపంలో అడ్డగించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా ఎస్పీ అక్షంశ్ యాదవ్ ఘటనాస్థలిని పరిశీలించి, విచారణను పర్యవేక్షించారు.నమ్మిన శిష్యులే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం నిందితులను విచారిస్తున్న పోలీసులు.. దోపిడీ కోసమే హత్య జరిగిందా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవాల్సి ఉంది.

మంత్రి పదవి ఇవ్వలేదు.. నిధులూ రావడం లేదు



- మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని రాజగోపాల్‌రెడ్డి ఆవేదన
- సీఎం, డిప్యూటీ సీఎంను కలిసినా నిధులు రావడం లేదని విమర్శ
- నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందని వ్యాఖ్య
- బిల్లులు చెల్లించక రోడ్డు పనులు నిలిచిపోతున్నాయని ఆరోపణ
- అభివృద్ధి జరగకపోతే ఎమ్మెల్యే పదవిని వదులుకుంటానని ప్రకటన

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి అడిగినా నియోజకవర్గానికి నిధులు రావడం లేదని వాపోయారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేస్తానంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి చర్చకు దారితీశాయి. గట్టుప్పల్ మండలంలో పర్యటించిన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై మాట్లాడారు. పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని, అయినప్పటికీ మనసు చంపుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుత పనులకే నిధులు ఇవ్వకపోతే కొత్త పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. జీతాలు, రైతు భరోసా వంటి పథకాలకు నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. గతంలో తాను కష్టపడి గెలిపించిన పలువురు నేతలు తనను మోసం చేశారని ఆరోపించారు. ఎవరికీ భయపడేది లేదని, రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయనకు విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. గతంలోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకావడంతో పరిస్థితులు సద్దుమణిగాయని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారం మళ్లీ వివాదానికి కారణమైంది. తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకా? లేక సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి నేరుగా తలపడేందుకు సంకేతమా? అన్న చర్చ మొదలైంది. ఇటీవల నిధుల విషయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

- మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు
- రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు
- పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం
- శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానం ప్రతిపాదన
- ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది. నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి. రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను కలిపే కారిడార్లను ప్రతిపాదించారు. మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు.

భూ రికార్డుల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

- భూ వివాదాలకు చెక్.. రైతులకు నష్టం లేకుండా జాయింట్ సర్వేలు!
- రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఆధునిక టెక్నాలజీతో భూముల హద్దుల గుర్తింపు
- రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారం



హైదరాబాద్, నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ సరిహద్దు వివాదాలకు(శాశ్వత పరిష్కారం చూపడంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా రెవెన్యూ, అటవీ భూముల మధ్య నెలకొన్న హద్దుల సమస్యలను పరిష్కరించేందుకు సంయుక్త సర్వేలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో రైతులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు

రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం రెవెన్యూ, అటవీ, సర్వే, సెటిల్‌మెంట్ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని రెవెన్యూ, ఫారెస్ట్ భూములకు సంబంధించిన సరిహద్దు వివాదాలపై చర్చించారు. రెండు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వేలు చేపట్టాలని సూచించారు. భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆధునిక టెక్నాలజీతో భూముల హద్దుల గుర్తింపు

భూముల సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ విధానాలను వినియోగించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయం, బాధ్యతాయుతమైన పనితీరుతో సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. భూముల సరిహద్దులను కచ్చితంగా గుర్తించడం ద్వారా భవిష్యత్తులో కొత్త వివాదాలు తలెత్తకుండా నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం జిల్లా, మండల స్థాయిల్లో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారం

భూ సర్వే ప్రక్రియలో స్థానిక రైతులు, ప్రజలను భాగస్వాములను చేయాలని పొంగులేటి సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చిన తర్వాతే భూముల సరిహద్దులను ఖరారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు రాకూడదని స్పష్టం చేశారు. సామాన్యుల హక్కులకు భంగం కలగకుండా సమస్యలను పరిష్కరించడమే ప్రాధాన్యంగా పనిచేయాలని పేర్కొన్నారు.

భూ రికార్డుల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో భూ రికార్డుల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు తీసుకొస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖల ద్వారా రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూముల హద్దులపై స్పష్టత తీసుకురావడం ద్వారా రైతులకు భరోసా కల్పించడంతో పాటు భవిష్యత్తులో వివాదాలకు అవకాశం లేకుండా చేయాలని అధికారులకు సూచించారు.

తెలంగాణ అభివృద్ధికి మరో వేదిక



- హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్.. గడ్కరీ రాక!
- సదస్సుపై కోమటిరెడ్డి ప్రత్యేక దృష్టి
- ప్రత్యేక తెలంగాణ పెవిలియన్.. పెట్టుబడులపై ఫోకస్
- రోడ్లు, ఆస్పత్రుల పనులపై సమీక్ష

హైదరాబాద్: (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణను మౌలిక వసతుల అభివృద్ధికి కీలక కేంద్రంగా నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి(సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక సదస్సు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. దేశంలోని రహదారుల నిర్మాణ రంగానికి చెందిన ప్రముఖులు, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ఆర్ అండ్ బీ శాఖ మంత్రులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో అతిథులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు అంతర్జాతీయ ప్రమాణాలతో చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రహదారుల నిర్మాణంలో సాధిస్తున్న పురోగతి, భవిష్యత్ మౌలిక వసతుల ప్రణాళికలను ఈ వేదిక ద్వారా దేశానికి పరిచయం చేయాలని సూచించారు.

ప్రత్యేక తెలంగాణ పెవిలియన్.. పెట్టుబడులపై ఫోకస్


ఈ సదస్సులో ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సంస్కృతి, చారిత్రక విశిష్టత, అభివృద్ధి ప్రస్థానం, మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రతిబింబించేలా దీనిని తీర్చిదిద్దాలని సూచించారు. డిసెంబర్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు కూడా ఈ సదస్సును ఒక ప్రచార వేదికగా ఉపయోగించుకోవాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల పరిస్థితులను జాతీయ స్థాయి ప్రతినిధులకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.

రోడ్లు, ఆస్పత్రుల పనులపై సమీక్ష

సదస్సుఏర్పాట్లతో పాటు రాష్ట్రంలో కొనసాగుతున్న కీలక నిర్మాణ పనులపైనా మంత్రి సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి పనులు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రోడ్లు, ఉస్మానియా ఆస్పత్రి, నిమ్స్ విస్తరణ పనులు, నూతన హైకోర్టు భవన నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆల్వాల్‌లో నిర్మిస్తున్న టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ ఏడాదిలోనే వాటిని పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు హైదరాబాద్‌లో నిర్వహించడం రాష్ట్రానికి ప్రతిష్టాత్మక అవకాశమని ప్రభుత్వం భావిస్తోంది. రహదారుల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధిపై జాతీయ స్థాయి చర్చలకు ఈ సమావేశం వేదిక కానుంది. అదే సమయంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను ప్రముఖులకు వివరించేందుకు కూడా ఇది ఉపయోగపడనుంది. సదస్సును విజయవంతంగా నిర్వహించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకొచ్చేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి అధికారులకు సూచించారు.

కేబుల్ బ్రిడ్జిపై మరో విషాదం.. దుర్గం చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య?

- హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య
- మృతుడిని నల్లగండ్లకు చెందిన సాయి మహేశ్వర్‌గా గుర్తింపు
- కేబుల్ బ్రిడ్జి పైనుంచి దూకి బలవన్మరణానికి పాల్పడిన యువకుడు
- ఆర్థిక సమస్యల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యుల అనుమానం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మాదాపూర్ పోలీసులు



హైదరాబాద్, నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లోని దుర్గం చెరువులో విషాదం చోటుచేసుకుంది. మాదాపూర్ కేబుల్ బ్రిడ్జి పైనుంచి చెరువులో దూకి 29 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిని నల్లగండ్లలోని మీరో అపార్ట్‌మెంట్స్‌లో నివసించే సాయి మహేశ్వర్‌గా పోలీసులు గుర్తించారు. సాయి మహేశ్వర్ శనివారం మధ్యాహ్నం సమయంలో కేబుల్ బ్రిడ్జిపై నుంచి దుర్గం చెరువులోకి దూకేశాడు. సమాచారం అందుకున్న వెంటనే మాదాపూర్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి.

ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా గేమ్స్

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 2 (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహించనున్నామని, ఏర్పాట్లలో ఎక్కడా లోపం ఉండొద్దని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి(ఆదేశించారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే క్రీడల హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నదని తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే దీర్ఘకాలిక లక్ష్యంగా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, ప్రపంచస్థాయి క్రీడా శిక్షణను తెలంగాణ యువ క్రీడాకారులకు అందించేందుకు ఈ పోటీలను గొప్ప అవకాశంగా మలుచుకోవడం ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారురాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన అన్ని వనరులను ఖేలో ఇండియా పోటీలకు సైతం ఉపయోగించుకునేలా సమాంతరంగా పోటీలకు ఏర్పాట్లు చెయ్యాలని



అధికారులను ఆదేశించారు.

గ్రూప్ 1 స్థాయి అధికారులకు బాధ్యతలు

అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది ఖేలో ఇండియా పోటీల తర్వాత కూడా అవి గొప్ప క్రీడా వనరులుగా ఉపయోగపడేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల లోపం లేకుండా పటిష్ట చర్యలు తీసుకునే విధంగా గ్రూప్-1 స్థాయి అధికారులకు ఏర్పాట్ల నుంచి క్రీడలు ముగిసే వరకు పర్యవేక్షణా బాధ్యతలు అప్పగించాలన్నారు.వివిధ జిల్లాల్లో జరగనున్న పోటీలకు సంబంధించి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఆయా చోట్ల స్థానికంగా పనిచేస్తున్న ట్రైనీ అధికారులు, గ్రూప్-1 అధికారులను నియమించాలని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో క్రీడలకు కొన్ని చోట్ల చేపట్టిన మౌలిక సదుపాయాల పనులు క్రీడా పోటీలు ముగిసిన కొన్నేళ్లలోనే విచ్ఛిన్నం అయ్యాయని, అలాంటి పరిస్థితి రావొద్దన్నారు.

మార్కెట్లకు ఏఐ ఆహ్వానం!



దేశానికే ఆదర్శంగా తెలంగాణలో డిజిటల్ యార్డులు
మార్కెట్లో అడుగుపెట్టినప్పటి నుంచి రైతుకు డీజీ సేవలు
ఏఐ ఏర్పాటుకు వారం రోజుల్లో టెండర్ల ఆహ్వానం
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 2 (సామాన్యుడి అస్త్రం)

: దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ మార్కెట్ వ్యవస్థను(అందుబాటులోకి తీసుకురావాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు అధికారులను ఆదేశించారు. రైతుల పండించిన పంటలకు సరైన ధర లభించడంతో పాటు, మార్కెట్లలో క్రయవిక్రయాలు పూర్తి పారదర్శకంగా జరిగేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని మంత్రి సూచించారుసోమవారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్‌బాబుతో(కలిసి సమీక్ష నిర్వహించారు. రైతు మార్కెట్ యార్డులోకి ప్రవేశించినప్పటి నుంచి బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. రైతు వివరాల నమోదు, ప్రతి పంట లాట్ ఐడీ కేటాయింపు, డిజిటల్ బిడ్డింగ్ లేదా టెండర్ నమోదు, పంట నాణ్యత పరీక్ష, ఆన్‌లైన్ వేలం, ధర నిర్ణయం, రైతు అంగీకారం, పంట తూకం, అమ్మకపు బిల్లుల తయారీ, మార్కెట్ ఛార్జీల లెక్కింపు, రైతులకు చెల్లింపులు, గేట్ ఎగ్జిట్ నమోదు, ఈ- ఈ-పర్మిట్ల జారీ వరకు ఒకే వేదికపై నిర్వహించేలా వ్యవస్థను రూపొందించాలని తుమ్మల సూచిం చారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న డిజిటల్ మార్కెట్ వ్యవస్థలను అధ్యయనం చేసి, వాటికంటే మెరుగైన సాంకేతికతను తీసుకురావాలని చెప్పారు. మార్కె టింగ్ శాఖ అధికారుల హాజరు, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను కూడా ఈ వ్యవస్థలో భాగం చేయాలని సూచించారు. ఐటీ శాఖతో సమన్వయం చేసుకొని, వారం రోజుల్లోగా టెండర్లు పిలిచే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వ్యవస్థతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు, గోదాముల నిర్వహణ, రోజువారీ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి చెప్పా రు. యార్డుల్లో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా వివిధ పంటలకు లభిస్తున్న ధరలను ప్రదర్శించాలన్నారు. అధికంగా వ్యాపార లావాదేవీలు జరిగే మార్కెట్ యార్డుల్లో తొలుత ఈ సదుపాయాలను ఏర్పాటు చేసి, క్రమంగా ఇతర మార్కెట్లకు విస్తరిం చాలని తెలిపారు.

కోహెడ ఫ్రూట్ మార్కెట్ పనుల్లో వేగం పెంచాలి

కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పారు. టెండర్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రతినిధులు సూచించిన భూమి చదును సవరణలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తీసుకొని, వచ్చే వారం రోజుల్లోగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటిం గ్ డైరెక్టర్ రాహుల్ రాజ్, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు

ఆర్థిక ప్రగతి కేంద్రాలుగా జిల్లాలు

గ్లోబల్ సప్లై చైన్‌తో స్థానిక పరిశ్రమల అనుసంధానం
మెగా ఎఫ్‌టీఏ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 2(సామాన్యుడి అస్త్రం)

స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు) అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒక ఆర్థిక ప్రగతి కేంద్రంగా (గ్రోత్ ఇంజన్) తీర్చిదిద్దేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్తంగా సోమవారం టీ-హబ్‌లో నిర్వహించిన మెగా ఎఫ్టీఏ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌కు(ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో ఎగుమతుల పాత్ర కీలకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇండియా వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ (ఎఫ్‌టీఏలు) వల్ల అనేక నూతన వాణిజ్య అవకాశాలు తలుపు తడుతున్నాయని తెలిపారు. వీటిని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలోని పరిశ్రమలు, ఎగుమతిదారులు ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు మార్గనిర్దేశనం చేస్తామని స్పష్టం చేశారు. మేడ్ ఇన్ తెలంగాణ ఉత్పత్తులు ఎఫ్‌టీఏ భాగస్వామ్య



దేశాలన్నింటికీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.జిల్లాల వారీగా లభించే ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి, వాటి తయారీ, ప్రాసెసింగ్, ఎగుమతులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. దేశీయ ఆహార అవసరాలు తీరిన తర్వాత మిగిలే వ్యవసాయ ఉత్పత్తులు వృథా కాకుండా ఎగుమతులకు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, కలెక్టర్లు మను చౌదరి, ప్రియాంక ఆలా, కుష్బూ గుప్తా, అనురాగ్ జయంతి పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం, పంచాయతీ రాజ్‌శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. అందుకు వారి వ్యాపారాలకు అవసరమైన పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు దక్కేలా సహకరిస్తామన్నారు. డిసెంబరు 7-9 తేదీల మధ్య భారత్ ఫ్యూచర్ సిటీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026' చేపట్టనున్న నేపథ్యంలో సచివాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ.. స్వయం సహాయక సంఘాల నెట్‌వర్క్‌ల ద్వారా మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికతను సంక్షేమ కోణంలోనే చూడకుండా రాష్ట్ర ఆర్థిక బలాన్ని పెంపొందించే కీలక రంగంగా గుర్తించాలన్న సీతక్క.. 'వీ-హబ్' ద్వారా మహిళా వ్యాపారవేత్తలకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును పెంచండి



- రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువును మరికొన్ని రోజుల పాటు పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.
- ఎన్నికల సంఘానికి పొన్నం విజ్ఞప్తి

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు గడువును మరికొన్ని రోజుల పాటు పొడిగించాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 6న ఓటరు నమోదు గడువు ముగుస్తుందని.. అయితే దసరా, దీపావళి పండుగలు మధ్యలో రావడంతో చాలామంది అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయించుకోలేకపోయారని తెలిపారు. వారందరికీ అవకాశం కల్పించేందుకు తుది గడువును మరికొన్ని రోజుల పాటు పొడిగించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గం

రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌కు కొత్త కార్యవర్గం ఖరారైంది. మొత్తం 12 మంది ఉపాధ్యక్షులు, 10 మంది ప్రధాన కార్యదర్శులు, 11 మంది సంయుక్త కార్యదర్శులతో కొత్త కార్యవర్గాన్ని ఏఐసీసీ ఖరారు చేసినట్లు తెలిసింది. 20కి పైగా జిల్లాలకు అధ్యక్షుల పేర్లూ ఖరారైనట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో దీనికి సంబంధించి ప్రకటన వెలువడనుంది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియామకం తర్వాత.. కొత్త కార్యవర్గం ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇన్నాళ్లుగా పెండింగ్‌లోనే ఉంది.

ఆస్పత్రుల్లో కరెంటు కోతల్లేకుండా చర్యలు




హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

ఎల్‌నినో నేపథ్యంలో వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలని, ఆస్పత్రుల్లో నీరు, విద్యుత్, ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ (డీఎ?సహెచ్)పరిధిలో నిర్మాణాలు పూర్తయిన 9 భవనాల్లో అవసరమైన పరికరాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేసి, ఆస్పత్రులను ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా సిద్ధం చేయాలని సూచించారు. డీఎ?సహెచ్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

- తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ
- 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య
- ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ
- ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా
- తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా



హైదరాబాద్, నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది. ఈవీఎంలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అంతకుముందు సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా పలువురు పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావుతో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకున్న అమిత్ షా అక్కడ భోజన విరామం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు పలువురు ప్రముఖులతోనూ సమావేశమయ్యారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్రలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు 'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం) అనే పేరు పెట్టింది. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా, ఎస్ఐఆర్‌పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ పాదయాత్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రణాళిక రూపొందించింది.

త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కదంతొక్కిన కాషాయ శ్రేణులు



- 'ఇండియా' కూటమికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' నినాదంతో బీజేపీ ర్యాలీ
- బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు
- కాంగ్రెస్ తీరుపై సోషల్ మీడియా వేదికగా అమిత్ షా తీవ్ర విమర్శలు

హైదరాబాద్, నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు.నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు.నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

3హైదరాబాద్, నవంబర్ 2: (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేదని.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో శిక్షణ అందిస్తామని వెల్లడించారు.విద్యార్థులకు ఏఐ, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ విద్యార్థులకూ ప్రత్యేక కోర్సులను అందుబాటులో ఉంటాయన్నారు. తద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను విద్యార్థులు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు అందిస్తామన్నారు. విద్యార్థులకు హ్యాకథాన్లు, ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. కళాశాల అధ్యాపకులకూ ప్రపంచస్థాయి ఏఐ, క్లౌడ్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. లక్ష మంది యువతకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




అమిత్ షా.. తెలంగాణకు ఇచ్చిన నిధులెన్ని?: మంత్రి పొన్నం సూటి ప్రశ్న



హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

నగరంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికే పరిమితమైందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్‌పై అనేక ఆరోపణలు చేసిన అమిత్ షా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులెన్ని, రాష్ట్రం నుంచి వసూలు చేస్తున్న పన్నులెన్నో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై తాము చర్చకు సిద్ధమని, బీజేపీ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు నెలవారీ పింఛన్లు, ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికి రూ.15 లక్షలు ఇస్తామన్న హామీ ఏమైందని కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించారు. పెట్రోల్ ధరను రూ.50కి తగ్గిస్తామన్న హామీ గుర్తులేదా? అంటూ నిలదీశారు.ఈ సందర్భంగా తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు దృష్ట్యా కేంద్రం తక్షణమే సహాయం చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. దేశంలో 12 ఏళ్ల పాలనలో బీజేపీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిందని పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. విదేశీయుల ఓట్లు తొలగించామని బీజేపీ నేతలు చెబుతున్నారని, అయితే ఎంతమందిని దేశం నుంచి పంపించారో చెప్పాలని అమిత్ షాను డిమాండ్ చేశారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (ꟻ×=) ప్రక్రియపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి పొన్నం సవాల్ విసిరారు.అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్లను తొలగించడంపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని మంత్రి చెప్పుకొచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యాలయాల నుంచే ఓట్ల తొలగింపు ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పాలనలో అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో మోదీ, అమిత్ షా ట్యాక్స్ నడుస్తోందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో అమిత్ షా పర్యటన పూర్తిగా విఫలమైందని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

తెలంగాణలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్న సినీనటి మంచు లక్ష్మి



సంగారెడ్డి (సామాన్యుడి అస్త్రం)

గ్రామీణ విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలన్నదే తన లక్ష్యమని ప్రముఖ సినీ నటి మంచు లక్ష్మి అన్నారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న లక్ష్మి.. నిరుపేదల విద్యా ప్రమాణాలు పెంచేందుకు తన ట్రస్ట్ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు.సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న మంచు లక్ష్మి.. చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో 'టీచ్ ఫర్ చేంజ్' ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్మించిన డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు తన ట్రస్ట్ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాలో 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యను అందించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం పాఠశాలల్లో అత్యాధునిక సాంకేతికతో కూడిన విద్యను అందించడానికి.. స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్ రూమ్స్, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ మోసగాళ్ల వలలో కానిస్టేబుల్..

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం దిశగా మరో అడుగు ముందుకేసింది. దేశీయ బొగ్గు ఉత్పత్తిని పెంచడం, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో 2026 ఆగస్టులో దేశ బొగ్గు దిగుమతులు 5.83 శాతం తగ్గినట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. గత ఏడాది ఆగస్టులో 111.05 మిలియన్ టన్నులుగా ఉన్న ఈ ఏడాది అదే నెలలో 104.57 మిలియన్ టన్నులకు పడిపోయాయి. ముఖ్యంగా దేశీయ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల్లో కోసం చేసుకునే దిగుమతులు ఏకంగా 35.23 శాతం తగ్గడం గమనార్హం.స్వదేశీ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఇంధన రంగంలో సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తన పోస్టులో వెల్లడించారు.

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంపై మంత్రి లోకేశ్ కీలక అప్‌డేట్

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంలో పురోగతి ఉందన్న మంత్రి లోకేశ్

స్పృహలోకి వచ్చిన బాలికను తల్లి పరామర్శించిందని వెల్లడి

సాయంత్రం వెంటిలేటర్ తొలగించే అవకాశం ఉందని డాక్టర్లు చెప్పినట్లు వెల్లడి

వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుందని మంత్రి పోస్ట్

స్నేహితురాలు లక్ష్మికి కూడా ఆసుపత్రిలో చికిత్స అందుతోందని వెల్లడి





అమరావతి, నవంబర్2(సామాన్యుడి అస్త్రం)

రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిలో పురోగతి కనిపిస్తోందని వైద్యుల బృందం వెల్లడించినట్లు ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. బాలిక స్పృహలో ఉందని, తల్లి ఆమెను పరామర్శించిందని తెలిపారు. వైద్యుల సూచనలను అర్థం చేసుకుని స్పందిస్తోందని వివరించారు. పరిస్థితి ఇలాగే మెరుగుపడితే గురువారం సాయంత్రం వెంటిలేటర్ సపోర్ట్ తొలగించే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నట్లు చెప్పారు. బాలిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఇదే ఘటనలో గాయపడిన మరో బాలిక లక్ష్మి ధైర్యసాహసాలను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఓ వ్యక్తి రంపంతో పాఠశాలలోకి ప్రవేశించి దాడికి పాల్పడిన సమయంలో లక్ష్మి భయపడి పారిపోకుండా తన స్నేహితురాలిని కాపాడేందుకు ముందుకు వెళ్లిందని తెలిపారు. ఆమెను రక్షించే ప్రయత్నంలో తాను కూడా తీవ్రంగా గాయపడిందని పేర్కొన్నారు. తనను తాను కాపాడుకునే అవకాశం ఉన్నా.. స్నేహితురాలికి అండగా నిలిచిందని ప్రశంసించారు.ప్రస్తుతం ఇద్దరు బాలికలూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని లోకేశ్ తెలిపారు. లక్ష్మికి కూడా మెరుగైన వైద్యం అందిస్తున్నామని, రెండు కుటుంబాలకూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని ఏ పాఠశాల తరగతి గదిలోనూ చిన్నారులు అభద్రతకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పోలీసు శాఖకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలసుబ్రహ్మణ్యం సమర్థుడైన అధికారి: సీఎం చంద్రబాబు నివాళి



విశ్రాంత ఐపీఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం పార్థివదేహానికి నివాళులర్పించిన చంద్రబాబు

క్యాన్సర్‌తో పోరాడుతూనే విధుల్లో కొనసాగారని గుర్తు చేసుకున్న ముఖ్యమంత్రి

టెక్నాలజీతో పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడిన సీఎం

ఆయన మృతి పోలీసు శాఖకు తీరని లోటు అని వ్యాఖ్య

అమరావతి, (సామాన్యుడి అస్త్రం)

విశ్రాంత ఐపీఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం హఠాన్మరణం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన పార్థివదేహానికి నివాళులర్పించిన అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. బాలసుబ్రహ్మణ్యం అత్యంత సమర్థుడైన, ప్రజాహితం కోరిన అధికారని కొనియాడారు. పదవీ విరమణ చేసిన రెండు నెలలకే ఆయన మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.బాలసుబ్రహ్మణ్యం మూడు దశాబ్దాల పాటు పోలీసు శాఖలో అందించిన సేవలను చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. “ఉమ్మడి రాష్ట్రంలో జగిత్యాల లాంటి సమస్యాత్మక ప్రాంతాల్లో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆర్టీసీ ఎండీగా సంస్థను సమర్థంగా నడిపించారు. టెక్నాలజీపై ఆయనకు ఉన్న ఆసక్తితో ‘ఈ-ప్రగతి’ వంటి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ప్రతి విభాగంలోనూ తనదైన ముద్ర వేసి సంస్కరణలు అమలు చేశారు” అని చంద్రబాబు ప్రశంసించారుక్యాన్సర్‌తో పెద్ద యుద్ధమే చేస్తూ, చికిత్స పొందుతూ కూడా విధులను నిర్వర్తించారని సీఎం గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర విభజన సమయంలో బాలసుబ్రహ్మణ్యం చాలా బాధపడ్డారని తెలిపారు. పోలీసు శాఖకు వన్నె తెచ్చిన గొప్ప అధికారిని కోల్పోయామని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

అర్నాబ్ తుపాను నష్టంపై కేంద్ర బృందం పరిశీలన



కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

దెబ్బతిన్న పంటలు, ఆక్వా చెరువులను పరిశీలించిన అధికారులు

త్వరలోనే కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడి

అమరావతి, నవంబర్2,(సామాన్యుడి అస్త్రం)

‘అర్నాబ్’ తుపాను ఆంధ్రప్రదేశ్‌లో మిగిల్చిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించింది. ఆదివారం కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించింది. తుపాను వల్ల జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని బృంద సభ్యులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం కాకినాడ జిల్లాలో పర్యటించింది. ఉప్పాడ తీర ప్రాంతం, కాకినాడ ఫిషింగ్ హార్బర్‌తో పాటు దెబ్బతిన్న ఉప్పాడ రహదారిని అధికారులు పరిశీలించారు. తాళ్లరేవు, పిఠాపురం, కాజులూరు మండలాల్లోని అరటి తోటలను, పోలేకుర్రు, కొలంక గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు. ఫిషింగ్ హార్బర్‌లో పాడైన పడవలు, వలల గురించి మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరగా, సంభవించిన నష్టంపై పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తదితర అధికారులు పాల్గొన్నారు

మరో బృందం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో పర్యటించింది. దెబ్బతిన్న పంటలు, ఆక్వా చెరువులు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలను బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. నరసాపురం పట్టణంతో పాటు లిఖితపూడి, చినలంక, బియ్యపుతిప్ప వంటి గ్రామాల్లో జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్ నాగరాని కేంద్ర బృందానికి వివరించారు. అధికారులు రైతులు, మత్స్యకారులు, మహిళలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఏపీలో 13 చోట్ల భారీ భద్రత మధ్య రీపోలింగ్




బూత్ కబ్జాలు, అక్రమాల ఆరోపణలు.. రంగంలోకి దిగిన ఎస్ఈసీ

పలు మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్న పోలింగ్

రేపు ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం

అమరావతి, (సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల రిగ్గింగ్, బూత్ కబ్జా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా మున్సిపాలిటీల పరిధిలోని 13 పోలింగ్ కేంద్రాల్లో ఈరోజు రీపోలింగ్ నిర్వహిస్తోంది. పోలింగ్ సందర్భంగా జరిగిన అక్రమాలపై జిల్లా కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకుల నుంచి అందిన నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్ఈసీ ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.అనంతపురం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌కు చెందిన ఒక పోలింగ్ కేంద్రం, పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీలోని 23వ వార్డులో ఒక కేంద్రం, ప్రకాశం జిల్లా చీమకుర్తి మున్సిపాలిటీలోని 14వ వార్డులో ఒక కేంద్రంలో రీపోలింగ్ జరుగుతోంది. అలాగే, తిరుపతి, కడప, జమ్మలమడుగు, పులివెందులలోనూ పలు వార్డుల్లో రీపోలింగ్ చేపట్టారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.గతంలో మాదిరిగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించడంతో పాటు, పూర్తిస్థాయి వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ నిఘా మధ్య ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ రీపోలింగ్ ప్రక్రియ సాయంత్రంతో ముగియనుండగా, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అన్ని మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును రేపు ఉదయం 8 గంటల నుంచి చేపట్టి, ఫలితాలను వెల్లడించనున్నారు.



ఈ అర్ధరాత్రి తీరం తాకనున్న ‘మురసు’ తుపాను.. ఒంగోలుకు 170 కి.మీ దూరంలో కేంద్రీకృతం

ఏపీ తీరం వైపు దూసుకొస్తున్న ‘మురసు’ తీవ్ర తుఫాను

నేటి అర్ధరాత్రి నెల్లూరు-నర్సాపురం మధ్య తీరం దాటే అవకాశం

గంటకు 120 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం

కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో అతి భారీ వర్షాలు

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని అధికారుల హెచ్చరిక

అమరావతి, నవంబర్2,((సామాన్యుడి అస్త్రం)

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ‘మురసు’ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది ఏపీపై పెను ప్రభావాన్ని చూపేందుకు సిద్ధమైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ తుపాను నవంబర్ 2వ తేదీ (సోమవారం) అర్ధరాత్రి 11:30 గంటల నుంచి మరుసటి రోజు, నవంబర్ 3వ తేదీ (మంగళవారం) తెల్లవారుజామున 4:00 గంటల మధ్యలో నెల్లూరు, నర్సాపురం మధ్య, ఒంగోలుకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉంది.తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం గంటకు 120 కిలోమీటర్లకు చేరుకోవచ్చని అధికారులు హెచ్చరించారు. ప్రస్తుతం ఈ తుపాను పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో, నెల్లూరుకు ఆగ్నేయంగా 110 కిలోమీటర్లు, బాపట్లకు 190 కిలోమీటర్లు, తిరుపతికి 160 కిలోమీటర్లు, కావలికి 130 కిలోమీటర్లు, ఒంగోలుకు ఆగ్నేయంగా 170 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాయవ్య దిశగా కదులుతూ ఇది వేగంగా తీరానికి చేరువవుతోంది.

భారీ నుంచి అతి భారీ వర్షాలు


‘మురసు’ తుపాను ప్రభావంతో రానున్న రెండు రోజులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు (21 సెం.మీ కంటే ఎక్కువ) నమోదయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నవంబర్ 3న తెలంగాణలోనూ అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి.

సముద్రం అల్లకల్లోలం.. 2 మీటర్ల ఎత్తున అలలు


తుపాను తీరం దాటే సమయంలో సముద్రం తీవ్రంగా అల్లకల్లోలంగా మారుతుంది. ముఖ్యంగా దక్షిణ కోస్తాంధ్రలోని లోతట్టు ప్రాంతాలను ఉప్పెన ముంచెత్తే ప్రమాదం ఉంది. అలల ఉద్ధృతి సాధారణం కంటే 1.5 నుంచి 2 మీటర్ల ఎత్తు వరకు ఎగసిపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాలపై ఈ ప్రభావం అధికంగా ఉండొచ్చని తెలిపారు. నవంబర్ 2 సాయంత్రం నుంచి 3వ తేదీ ఉదయం వరకు సముద్రపు అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల తీర ప్రాంతాల్లో గంటకు 80-90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడం మొదలై, రాత్రికి 120 కిలోమీటర్లకు చేరుకుంటుంది.

అధికారులు అప్రమత్తం.. మత్స్యకారులకు హెచ్చరిక

తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తీర ప్రాంత జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేసి, సహాయక చర్యలకు ఏర్పాట్లు చేస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తుపాను తీరం దాటిన తర్వాత కూడా దీని ప్రభావం కొనసాగుతుంది. నవంబర్ 3వ తేదీ ఉదయానికి గాలి వేగం గంటకు 70-80 కిలోమీటర్లకు తగ్గి, సాయంత్రానికి మరింత బలహీనపడనుంది.



బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులకు ఇంటిగ్రేటెడ్ ట్రీట్‌మెంట్



బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలకు వేర్వేరుగా కాకుండా ఉమ్మడి చికిత్స

'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్ సిండ్రోమ్'గా గుర్తింపు

దేశవ్యాప్తంగా 50 మంది వైద్య నిపుణులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026'

భారతీయుల శరీర తత్వానికి అనుగుణంగా కొత్త వైద్య ప్రమాణాలు ప్రతిపాదన

కీలక ఔషధాలను నిత్యావసర జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కిడ్నీ జబ్బులు... ఈ మూడింటినీ వేర్వేరు సమస్యలుగా చూస్తూ, వేర్వేరు వైద్యులతో చికిత్స చేయించుకోవడం ప్రమాదకరమని భారత వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మూడు వ్యాధులను కలిపి ఒకే సిండ్రోమ్‌గా పరిగణించి, సమగ్ర చికిత్స అందించాలని సూచిస్తున్నారు. ఈ మేరకు దేశంలోని వివిధ విభాగాలకు చెందిన 50 మంది ప్రముఖ వైద్యులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026' పేరుతో ఒక విధాన పత్రాన్ని విడుదల చేశారు. ఈ ప్రతిపాదనలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తూ, ప్రతిష్ఠాత్మక వైద్య జర్నల్ 'ది లాన్సెట్ రీజినల్ హెల్త్ - సౌత్‌ఈస్ట్ ఆసియా'లో ఇది ప్రచురితమైంది.


సమగ్ర చికిత్స ఎందుకు అవసరం?

ప్రస్తుతం మన దేశంలో బీపీకి జనరల్ ఫిజీషియన్, షుగర్‌కు ఎండోక్రైనాలజిస్ట్, కిడ్నీ సమస్యలకు నెఫ్రాలజిస్ట్ వద్దకు వెళ్లే విధానం అమల్లో ఉంది. అయితే బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కలిపి 'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్' (సీకేఎం) సిండ్రోమ్‌గా చూడాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మూడు సమస్యలూ ఉన్నవారు పదేళ్లలోపు గుండె జబ్బులతో మరణించే ప్రమాదం 30 నుంచి 50 శాతం వరకు అధికంగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఏటా దాదాపు 25 లక్షల మంది ఇలాంటి సమస్యలతో అకాల మరణం చెందుతున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. వీరికి అవసరమైన మూడు కీలక ఔషధాలను (రెనిన్-యాంజియోటెన్సిన్ బ్లాకర్స్, ఎస్జీఎల్‌టీ2 ఇన్హిబిటర్లు, స్టాటిన్లు) కలిపి వాడుతున్న రోగులు 20 శాతం కన్నా తక్కువ ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

భారతీయుల కోసం కొత్త ప్రమాణాలు

పాశ్చాత్య దేశాల ప్రజలతో పోలిస్తే భారతీయుల శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. ఇక్కడ చాలామంది 'థిన్-ఫ్యాట్' రకానికి చెంది ఉంటారు. అంటే, పైకి సన్నగా కనిపించినా, అంతర్గత అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. దీనివల్ల చిన్న వయసులోనే గుండె జబ్బుల ముప్పు పెరుగుతోంది. అందుకే, పాశ్చాత్య దేశాల బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) కొలతలు మనకు సరిపోవని నిపుణులు తేల్చారు. భారతీయులకు బీఎంఐ 23 దాటితే అధిక బరువుగా, 27.5 దాటితే స్థూలకాయంగా పరిగణించాలని సూచించారు. పురుషుల్లో నడుము చుట్టుకొలత 90 సెం.మీ, స్త్రీలలో 80 సెం.మీ మించకూడదని పేర్కొన్నారు. అమెరికా రిస్క్ కాలిక్యులేటర్లకు బదులుగా, మన దేశ ప్రజల సమాచారంతో 'ఇండియా-ప్రివెంట్' పేరుతో ప్రత్యేక రిస్క్ అసెస్‌మెంట్ వ్యవస్థను రూపొందించాలని ప్రతిపాదించారు.

బరువు తగ్గాలనుకుంటున్నారా? ఆకలేస్తే ఈ 10 స్నాక్స్‌ట్రై చేయండి!



బరువు తగ్గాలంటే స్నాక్స్ పూర్తిగా మానాల్సిన అవసరం లేదంటున్న నిపుణులు

మసాలా మజ్జిగలో ప్రోటీన్.. దీంతో ఎక్కువ సేపు కడుపు నిండిన భావన

చిలగడదుంపతో తీపి కోరికకు చెక్ పెట్టడంతో పాటు కాంప్లెక్స్ కార్బ్స్

పరిమితంగా తీసుకుంటే పనీర్, డార్క్ చాక్లెట్, పీనట్ బటర్ కూడా మంచివే

వేయించిన పనీర్ ముక్కలు, పుచ్చకాయ, నట్స్ కూడా మంచివే!

బరువు తగ్గాలంటే స్నాక్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. భోజనాల మధ్య ఎక్కువ గ్యాప్ వస్తే మరింత ఆకలి వేయొచ్చు. దీంతో తర్వాతి భోజనంలో ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. అందుకే ఆకలిని అదుపులో ఉంచే స్నాక్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ఎన్డీటీవీ కథనం ప్రకారం.. పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా 10 స్నాక్స్ సూచించారు. అవేంటో చూద్దాం.

1. మసాలా మజ్జిగ: ఈ లిస్ట్‌లో మసాలా మజ్జిగకు మొదటి స్థానం ఇచ్చారు. ఇందులో ప్రొటీన్ ఉండటంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుందని లవ్‌నీత్ బాత్రా చెబుతున్నారు.

2. కాల్చిన చిలగడదుంప: చిలగడదుంపలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. తీపి తినాలనిపించినప్పుడు కూడా ఇది మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని నిపుణురాలు సూచించారు.

3. మరమరాల చాట్: మరమరాలతో తయారు చేసే చాట్ పెద్ద పరిమాణంలో తిన్నా కేలరీలు ఎక్కువగా చేరకుండా చూసుకోవచ్చని ఆమె చెబుతున్నారు. ఇందులో కూరగాయలు కలిపితే మరింత పోషకాహారంగా మారుతుంది.

4. కూరగాయలు.. శనగల పేస్ట్: కీర, క్యారెట్ వంటి కూరగాయల ముక్కలను శనగలతో తయారు చేసిన పేస్ట్ (హమ్మస్)తో కలిపి తినొచ్చు. కూరగాయల నుంచి ఫైబర్, శనగల పేస్ట్ నుంచి ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. తేలికగా ఉండే ఈ స్నాక్ ఆకలిని కొంతసేపు అదుపులో ఉంచుతుంది.

పప్పు ఇలా వండుతున్నారా? పోషకాలు తగ్గిపోవచ్చు..

పప్పులను ఎలా వండుతున్నాం? ఎలా తింటున్నామన్నది కూడా ముఖ్యమంటున్న నిపుణులు

పప్పులను వండే ముందు కనీసం రెండు గంటలు నానబెట్టాలని సూచన

సహజంగా కనిపించే అన్‌పాలిష్డ్ పప్పులను ఎంచుకోవడం మంచిదని సలహా

ఒకే రకం పప్పు తినడం కంటే రకాలు మార్చి తినడం మంచిదంటున్న నిపుణులు

పప్పుతో సలాడ్లు, స్నాక్స్, రొట్టెల వంటివి చేసుకుంటే రోజూ తినే అవకాశం ఉంటుందని సూచన



భారతీయ వంటకాల్లో పప్పుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు ఇలా రకరకాల పప్పులు మన రోజువారీ ఆహారంలో భాగంగా ఉంటాయి. ఇవి ప్రొటీన్లు, ఇతర పోషకాలు అందించడంతో పాటు జీర్ణక్రియకు కూడా మేలు చేస్తాయి. అయితే పప్పును ఎలా వండుతున్నాం? ఎలా తింటున్నామన్నది కూడా చాలా ముఖ్యం. కొన్ని చిన్న పొరపాట్ల వల్ల పప్పులోని పోషకాలు తగ్గిపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పప్పును ముందుగా నానబెట్టాలి

పప్పును వండే ముందు కనీసం రెండు గంటలు నీటిలో నానబెట్టడం మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పప్పులో ఉండే ఫైటిక్ యాసిడ్ వంటి యాంటీ న్యూట్రియెంట్లు తగ్గుతాయి. దీంతో పప్పులోని ప్రొటీన్‌ను శరీరం మెరుగ్గా గ్రహించే అవకాశం ఉంటుంది. అయితే పప్పును నానబెట్టిన నీటిని పారబోయకూడదు. నానబెట్టే సమయంలో బి, సి విటమిన్లలో కొంత భాగం నీటిలోకి చేరుతుంది. ఆ నీటిని పారబోస్తే ఈ పోషకాలు కూడా వృథా అవుతాయి. అయితే నానబెట్టే ముందు పప్పును మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దుమ్ము, పాలిష్, ఇతర మలినాలు తొలగిన తర్వాతే నానబెట్టాలి.

మెరిసే పప్పులు వద్దు

నిపుణుల సూచనల ప్రకారం.. పప్పు ఎంపికలోనూ జాగ్రత్త అవసరం. మెరుస్తూ కనిపించే పప్పులను కాకుండా సహజంగా కనిపించే అన్‌పాలిష్డ్ పప్పులను ఎంచుకోవడం మంచిది. వీటిలో సహజ పోషకాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

ఒకే పప్పుతో ఆగిపోవద్దు

రోజూ ఒకే రకం పప్పు తినడం కంటే రకాలు మార్చి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒక్కో రకం పప్పులో ఒక్కో రకమైన పోషకాలు ఉంటాయి. అందుకే కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు వంటి వాటిని ఆహారంలో మారుస్తూ తీసుకోవచ్చు.పప్పుతో సలాడ్లు, స్నాక్స్, రొట్టెల వంటి వంటకాలు కూడా చేసుకోవచ్చు. ఇలా రకరకాలుగా తీసుకుంటే రోజువారీ ఆహారంలో పప్పును సులభంగా భాగం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు

సైక్లింగ్‌తో వీర్యకణాల సంఖ్య తగ్గుతుందా?



ఎక్కువసేపు సైక్లింగ్ చేస్తే వీర్య నాణ్యతపై ప్రభావం

వారానికి 5 గంటలకు పైగా సైక్లింగ్‌తో ప్రమాదం

వృషణాల వేడి, ఒత్తిడి ప్రధాన కారణాలని డాక్టర్ల వివరణ

సరైన సీటుతో ఒత్తిడిని తగ్గించుకునే ఛాన్స్

సైక్లింగ్ మధ్యలో విరామాలు తీసుకోవాలని డాక్టర్ల సూచన

సైక్లింగ్ మంచి కార్డియో వ్యాయామం. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు బరువు నియంత్రణకు, కండరాల బలోపేతానికి ఉపయోగపడుతుంది. అయితే ఎక్కువ సమయం, తీవ్రంగా సైక్లింగ్ చేసే పురుషుల్లో వీర్య నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే దీనివల్ల శాశ్వతంగా సంతానలేమి వస్తుందని మాత్రం నిర్ధారణ కాలేదు.

ఎక్కువసేపు సైక్లింగ్‌తో ఇబ్బందేనా?

సాధారణంగా 20-30 నిమిషాల పాటు సరదాగా సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదే. కానీ వారానికి 5 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సైక్లింగ్ చేసే పురుషుల్లో తక్కువ వీర్యకణాల సంఖ్య కనిపించే అవకాశం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.ఎక్కువసేపు సైకిల్ సీటుపై కూర్చోవడం వల్ల జననాంగాల మధ్య భాగంపై ఒత్తిడి పెరుగుతుంది. వృషణాల చుట్టూ ఉష్ణోగ్రత పెరగొచ్చు. రక్తప్రసరణ కూడా కొంతకాలం తగ్గొచ్చు. ఇవి వీర్యకణాల సంఖ్య, కదలిక, ఆకృతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

వేడి, ఒత్తిడి కారణమా?

ఎక్కువసేపు బిగుతైన దుస్తులతో సైక్లింగ్ చేయడం వల్ల వృషణాల ఉష్ణోగ్రత పెరగొచ్చు. సరైన సీటు లేకపోతే నరాలు, రక్తనాళాలపై ఒత్తిడి పడే అవకాశం ఉంది. సీటు రాపిడి వల్ల చిన్నపాటి గాయాలు, మంట కూడా రావొచ్చు.వీర్యకణాలు తయారై పూర్తిగా అభివృద్ధి చెందడానికి సుమారు రెండున్నర నుంచి మూడు నెలలు పడుతుంది. అందువల్ల జీవనశైలిలో మార్పుల ప్రభావం వెంటనే కాకుండా కొన్ని నెలల తర్వాత కనిపించొచ్చని నిపుణులు చెబుతున్నారు.ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?ఎక్కువసేపు సైక్లింగ్ చేసే పురుషులు మధ్యలో విరామాలు తీసుకోవాలి. జననాంగాల మధ్య భాగంపై ఒత్తిడి తగ్గించేలా సరైన సీటును ఎంచుకోవాలి. మధ్యలో కట్‌అవుట్ ఉన్న సీట్లు కొంత ఉపశమనం ఇవ్వొచ్చు. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోకుండా మధ్యమధ్యలో లేచి నిలబడటం కూడా ఉపయోగపడుతుంది.సంతానోత్పత్తి ఆరోగ్యానికి వారానికి 150-180 నిమిషాల మితమైన వ్యాయామం సరిపోతుందని డాక్టర్లు సూచిస్తున్నారు. అతిగా, తీవ్రంగా వ్యాయామం చేయడం కంటే క్రమం తప్పకుండా మితమైన వ్యాయామం చేయడం మంచిదని తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్‌లో ఈ తప్పులు చేస్తున్నారా?
ఆపదలో మరింత ప్రమాదం తప్పదు!

గాయపడిన వ్యక్తిని అనవసరంగా కదపొద్దు

స్పృహ లేనివారికి ఆహారం, నీళ్లు ఇవ్వొద్దు

మూర్ఛలో నోట్లో ఏదీ పెట్టొద్దు

కాలిన గాయంపై ఐస్, టూత్‌పేస్ట్ రాయొద్దు

రక్తస్రావంపై కట్టు పదేపదే తీయొద్దు

ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలినా.. ప్రమాదంలో గాయపడినా.. కాలిన గాయమైనా వెంటనే ఏదో ఒకటి చేయాలని అనిపిస్తుంది. కానీ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం మాత్రమే కాదు.. సరైన విధంగా స్పందించడం కూడా చాలా ముఖ్యం. తెలియక చేసే కొన్ని ఫస్ట్ ఎయిడ్ చర్యలు పరిస్థితిని మరింత చేయిదాటేలా చేసే ప్రమాదం ఉంది. మరి ఎలాంటి తప్పులకు దూరంగా ఉండాలి?

గాయపడిన వ్యక్తిని వెంటనే కదపొద్దు

రోడ్డు ప్రమాదం, ఎత్తు నుంచి పడటం వంటి ఘటనల్లో గాయపడిన వ్యక్తిని వెంటనే పైకి లేపడం లేదా మరోచోటికి తరలించడం ప్రమాదకరం. వెన్నెముకకు గాయం అయి ఉంటే కదిలించడం వల్ల పరిస్థితి మరింత దిగజారొచ్చు. వెంటనే ప్రమాదం



పొంచి లేకపోతే వ్యక్తిని అలాగే ఉంచి వైద్య సాయం కోసం ప్రయత్నించాలి. అయితే శ్వాసకు ఇబ్బంది ఉంటే శ్వాస మార్గాన్ని తెరిచి ఉంచడం ముందుగా చేయాలి.

స్పృహలో లేని వ్యక్తికి నీళ్లు, ఆహారం ఇవ్వొద్దు

బలహీనంగా కనిపిస్తున్నారని.. నీళ్లు లేదా ఆహారం ఇవ్వడం సరికాదు. స్పృహ తగ్గిన వ్యక్తికి సరిగ్గా మింగడం సాధ్యం కాకపోవచ్చు. దీంతో ఆహారం, నీళ్లు శ్వాసనాళంలోకి వెళ్లి ఉక్కిరిబిక్కిరి అయ్యే ప్రమాదం ఉంది. మందులు కూడా ఇవ్వకూడదు. వ్యక్తి శ్వాస తీసుకుంటున్నా స్పృహలో లేకపోతే, వెన్నెముక గాయంపై అనుమానం లేనప్పుడు రికవరీ పొజిషన్‌లో ఉంచవచ్చు.

మూర్ఛ వచ్చినప్పుడు నోట్లో ఏదీ పెట్టొద్దు

మూర్ఛ వచ్చిన వ్యక్తులు నాలుక మింగేస్తారని చాలామందిలో అపోహ ఉంది. అందుకే నోట్లో చెంచా, గుడ్డ, వేళ్ల వంటి వాటిని పెడుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. నోటికి గాయాలు కావచ్చు. శ్వాసకు అడ్డంకి ఏర్పడొచ్చు. మూర్ఛ వచ్చిన వ్యక్తిని బలవంతంగా పట్టుకోవద్దు. చుట్టుపక్కల ఉన్న ప్రమాదకర వస్తువులను తొలగించి రక్షణ కల్పించాలి.

కాలిన గాయంపై ఐస్, టూత్‌పేస్ట్ రాయొద్దు

కాలిన వెంటనే ఐస్, టూత్‌పేస్ట్, వెన్న, నూనె వంటి వాటిని రాయడం మంచిది కాదు. ఇవి గాయాన్ని మరింత తీవ్రం చేయొచ్చు. కాలిన ప్రాంతంపై చల్లటి నీటిని పోయాలి. చర్మానికి అంటుకోని దుస్తులు, నగలను తొలగించవచ్చు. తీవ్రమైన కాలిన గాయాలకు వెంటనే వైద్య చికిత్స అవసరం.

గాయంపై కట్టును పదేపదే తీయొద్దు

తీవ్రంగా రక్తం కారుతున్నప్పుడు శుభ్రమైన గుడ్డ లేదా డ్రెస్సింగ్‌తో గట్టిగా ఒత్తి పట్టాలి.

డ్రీమ్ రోల్ కోసం ఇంట్లో కూర్చోలేను!

అందాల భామ మానుషి చిల్లర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో నటిగా, ఫ్యాషన్ ఐకాన్‌గా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్‌ను సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ ముద్దుగుమ్మ తన సినీ కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు తెలిపింది. ముఖ్యంగా తాను ఇండస్ట్రీలో తాను నేర్చుకున్న పాఠాల గురించి మాట్లాడుతూ.. "సినిమాల్లోకి కొత్తగా వచ్చినప్పుడు అందరి సలహాలు వినేదాన్ని. కానీ అనుభవం పెరిగే కొద్దీ సొంత నిర్ణయాలే ఎక్కువ సంతోషాన్ని ఇస్తున్నాయి.ఎలాంటి సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేనప్పుడు మన కోసం ప్రత్యేకంగా రోల్స్ రాసేవారు ఉండరు. అందుకే పర్ఫెక్ట్ డ్రీమ్ రోల్ కోసం ఇంట్లో కూర్చుని ఎదురుచూడటం కంటే, మనల్ని ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఉపయోగించుకోవడమే ఉత్తమం. మిస్ వరల్డ్ విజయం అందించిన ఆర్థిక స్వేచ్ఛ వల్ల నటనపై ఎలాంటి ప్రెజర్ లేకుండా స్వేచ్ఛగా సినిమాలు ఎంచుకోగలుగుతున్నా" అని చెప్పుకొచ్చింది.మానుషి ఇంకా విక్రాంత్ మాస్సేతో కలిసి నటించిన తన రాబోయే రొమాంటిక్ థ్రిల్లర్ 'స్నాప్' గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్ట్ కోసం నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. ముంబైలో నేను విన్న అత్యంత ఆసక్తికరమైన స్క్రిప్టుల్లో ఇది ఒకటి. చివరి నిమిషం వరకు సస్పెన్స్ కొనసాగుతూ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది' అని తెలిపింది.



కల్ట్, వైల్డ్ డ్రామా డానీ

రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్కళ్యాణ్ జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ నిర్మాణంలో కళ్యాణ్ జీ గోగణ తెరకెక్కించి చిత్రం 'డానీ'. ఈ సినిమాలో ఆశిష్ గాంధీ, సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 20న విడుదల చేయబోతోన్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ.. "ఇదొక కల్ట్ వైల్డ్ డ్రామా. అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా" అన్నారు.




కోలీవుడ్‌లో రజనీకాంత్ సరికొత్త రికార్డ్!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన 18 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్ల వసూళ్ల మార్క్‌ను దాటిన తొలి తమిళ చిత్రంగా ఈ సినిమా రికార్డు నెలకొల్పింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో అక్టోబర్ 15న విడుదలైన ఈ యాక్షన్ కామెడీ సీక్వెల్, వసూళ్లలో తన జోరును కొనసాగిస్తోంది.ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'సాక్‌నిల్క్' వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 18వ రోజు నాటికి ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 808 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇందులో దేశీయంగా రూ. 456 కోట్ల నెట్ (సుమారు రూ. 534 కోట్ల గ్రాస్) రాబట్టగా, విదేశాల్లో రూ. 273-274 కోట్ల వరకు వసూళ్లు సాధించింది. 18వ రోజైన ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 11.2 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.

ప్రేమలో దారుణంగా మోసపోయా: రెజీనా కసాండ్రా



విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు.

'రుద్రవనం పీఎస్' (జీ 5) సిరీస్ రివ్యూ!

నరేశ్ అగస్త్య ఒక వైపున తన బాడీ లాంగ్వేజ్ కి తగిన కథలను .. పాత్రలను ఎంచుకుంటూనే, మరో వైపున సిరీస్ లను చేస్తూ వెళుతున్నాడు. తాజాగా ఆయన చేసిన మరో వెబ్ సిరీస్ గా 'రుద్రవనం పీఎస్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రైమ్ తో ముడిపడిన ఈ మిస్టరీ థ్రిల్లర్, తమిళ సిరీస్ 'విలాంగు'కి రీమేక్. చారు వాకన్ .. బెనర్జీ .. రవీంద్ర ముఖ్యమైన పాత్రలను పోషించారు. శశిధర్ మున్నంగి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 7 ఎపిసోడ్స్ గా అక్టోబర్ 30వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.'రుద్రవనం' పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్ స్పెక్టర్ గా 'శివ కుమార్' (నరేశ్ అగస్త్య) పోలీస్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఉంటాడు. ఆయన భార్య 'శ్రావణి' గర్భవతిగా ఉంటుంది. ప్రేమించి .. తల్లిదండ్రులను ఎదిరించి తనతో వచ్చేసిన ఆమెను అతను ఎంతో అపురూపంగా చూసుకుంటూ ఉంటాడు. భార్యకి డెలివరీ డేట్ దగ్గర పడుతూ ఉండటంతో, ఓ పదిరోజుల పాటు సెలవు పెట్టే ఆలోచనలో ఉంటాడు. అదే సమయంలో ఓ మూడు కేసులు అతని ముందుకు వస్తాయి. ఫణీంద్ర అనే వ్యక్తి తన కూతురు పెళ్లి కోసం దాచిన 25 లక్షల విలువైన బంగారాన్ని దొంగలు కాజేస్తారు. ఇక తన తమ్ముడు 'చంద్రం' కనిపించడం లేదంటూ ఎమ్మెల్యే భైరవుడు (రాజా రవీంద్ర) చెప్పిన మరుసటి రోజునే, అడవిలో ఒక చోట తల లేని శవం బయటపడుతుంది. అది తన తమ్ముడిది కాదనీ, తన



తమ్ముడి చేతికి ఒక వ్రేలు ఉండదని భైరవుడు అంటాడు. అదే నిజమైతే చంద్రం ఏమైనట్టు? అది చంద్రం శవం కాకపోతే బయటపడిన శవం ఎవరిదీ? అనే ఒక సందేహం శివకుమార్ లో తలెత్తుతుంది.ఈ కేసుల కారణంగా శివకుమార్ సెలవు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ రెండు శవాలకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తున్న సమయంలోనే, మరో ఆరు హత్యలు జరిగినట్టుగా శివకుమార్ దృష్టికి వస్తుంది. మొదటి జరిగిన రెండు హత్యలకు .. ఆ తరువాత జరిగిన ఆరు హత్యలకు మధ్య ఎలాంటి సంబంధమైనా ఉందా అనే ఒక డౌట్ తో శివకుమార్ ముందుకు వెళతాడు. ఆ అన్వేషణలో అతనికి ఎలాంటి నిజాలు తెలుస్తాయి? ఆ హత్యలను చేసింది ఎవరు? అందుకు గల కారణాలు ఏమిటి? అనేది కథ.అడవికి కాస్త దగ్గరలో ఉన్న ఒక విలేజ్ .. అక్కడ వరుసగా జరుగుతున్న హత్యలు .. హంతకుడిని పట్టుకోవడానికి .. హత్యలకు గల కారణాలను తెలుసుకోవడానికి పోలీస్ అధికారులు చేసే ప్రయత్నాలను కలుపుకుంటూ ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. హత్యకి గురైనవారిలో ఎమ్మెల్యే తమ్ముడు కూడా ఉండటంతో, పోలీస్ అధికారులపై మరింత ఒత్తిడి పెరుగుతూ ఉంటుంది.

ఓ మైసా రే'.. రష్మిక 'మైసా' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి 'ఓ మైసా రే' పేరుతో తొలి పాట లిరికల్ వీడియోను సోమవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది.ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి, సుప్రసిద్ధ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని సింధుజ శ్రీనివాసన్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. కథానాయిక పాత్రలోని ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఈ లిరికల్ వీడియోలో రష్మిక మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది.రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రొటీన్ పాత్రలకు భిన్నంగా రష్మిక చేస్తున్న ఈ ప్రయోగంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.